# వైరస్ ! వైరస్ !

తప్పించుకు తిరుగుతున్న మొహాల్లో భయం
రహస్యం కానే కాదు
నేతులు తాగిన మూతులు
సంపంగి నూనె మీసాలు
తవ్వకాలలో కూడా దొరకవిక

భద్ర పరచిన పేటికలో చెదలుపట్టి
చిరుగులు పడ్డ కాగితాలు
కాలగర్భంలో కలిసిపోయిన జీవితాలు

లాభనష్టాల బేరీజుల్లో
ఇప్పటికే ఎందర్నో పోగొట్టుకున్నాం
మరణ భయమిప్పుడు
అంటరానితనాన్ని అనుభవంలోకి తెస్తూ
కంప్యూటర్లని కూడా వదలని సంస్కృతి
చెప్పకేం?
భూనభోంతరాల్లోని
ఏ సమస్యనైనా చీలికలు పేలికలు చేసి
ప్రజ్ఞాపాటవాల్ని జోడించి
దాని సహస్రహస్తాల్లో పెట్టి
సకాలంలో జోస్యంలా చెప్పించిన వాడిని

అంత వరకూ
నేను యజమాని
అది బానిస

ఆదమరచినపుడు
అపహరించిన దాఖలాలు చెరిగిపోకుండా
జాగ్రత్తలు నేర్పే పర్వంలోనే
ఉసిగొల్పే ప్రక్రియ అలవడింది

ఇప్పుడిక తరతమ భేదం లేదు
ఏ బలహీన క్షణమైనా దాని స్వంతం కావచ్చు
ఎంత ప్రక్షాళనం చేసుకున్నా సరే!